# శ్రీ స్వామి అనుగ్రహం



శ్రీ పెసల సుబ్బరామయ్య సార్

# దీక్ష చేసేవారికి సూచన

1. దీక్షాకాలంలో తప్పని సరియైతే తప్ప, స్వామివారి ధ్యాస తప్ప, ఇతర మాటలు మాట్లాడటం మానాలి. మన కాలమంతా సాధనలో గడపడం ఉత్తమము. దీక్షాకాలములో మన అన్నం మనం తినడం శ్రేయస్కరము. శ్రీ స్వామివారి అన్నము ఒక్కటి, రెండు చెంచాలు ప్రసాదంగా తీసుకొనవచ్చును.

2. దీక్ష పూర్తి అయినదాకా శ్రీ స్వామివారి సన్నిధిని వదలరాదు. అలా వదలి వెళితే తిరిగి మన సాధన మొదటకొస్తుందని గుర్తించాలి. స్త్రీలైతే బహిష్టు అయిన వారు ఆ రోజులు అధికంగా చేయవలసి వుంటుంది.

భక్తుల పాపకర్మలను దహించే శ్రీ స్వామివారి కృప అగ్నివంటిది. మన కృషి (సాధన) గాలి వంటిది. అగ్నికి గాలి లేనిదే మంటరాదు. ఈ విషయాన్ని ఈ క్రింది అనుభవం స్పష్టపరుస్తుంది.

తన పేరు ప్రచురించుటకు అంగీకరించని ఒక భక్తురాలు మర్మాయవములతో సహా ఒళ్ళంతా గడ్డలు లేచి నిద్రాహారములు లేకుండా భరించరాని బాధ అనుభవిస్తుంది. ఏ అవయవము వంగడము లేదు. నేల మీద దేకడం కూడా కష్టముగా యున్నది. అన్నం తింటే దొడ్డికి పోవడం కష్టమని ద్రవాహారంతో జీవిస్తుండేది. ఎన్నో ఇంజక్షన్లు, నాటు వైద్యాలు, భూతవైద్యాలు విఫలమైనాయి. ఆమెకు సపర్యలు చేసేందుకు భర్త తప్ప మరెవ్వరూ లేరు. తలుపూరు శ్రీ నారాయణదాసు ఆశ్రమములో విడిది చేసియున్న శ్రీ స్వామివారి సన్నిధికి, చివరి ఆశగా ఆమెను తీసుకొని వచ్చారు. శ్రీ స్వామివారికి విన్నవిస్తే ఒకవారం రోజులుంటే పోతుందన్నారు.

ఈ కాలంలో ఆమె చేసిన సాధన, పడిన శారీరక శ్రమ శ్రీ స్వామివారి హృదయాన్ని వెన్నలా కరిగించింది. ఆమె రెండు గోనె సంచులు తీసుకొని ఒక దాన్ని తన ముందు పరచుకొని చిన్నగా అరచేతుల మోపున ఆ గోనె సంచి మీదకు జరిగేది. మరలా రెండవ సంచి అలానే పరచి దానిమీదకు జరిగేది. ఈ విధంగా శ్రీ స్వామివారు వున్న పూరిపాక చుట్టూ భగవన్నామం చేస్తూ నిర్విరామంగా ముడ్డితో దేకుతూ ప్రదక్షిణము చేయసాగింది. అది ఏప్రిల్ నెల, వేసవి ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. సుడిగాలుల దుమారానికి కళ్ళు తెరువలేకున్నాము. ఈమె మాత్రం ఎంతో కష్టం మీద మిట్టమధ్యాహ్నంలో కూడా ప్రాణానికి తెగించి నిర్విరామంగా ముడ్డితో దేకుతూ ప్రదక్షిణలు చేస్తూనే వుంది. స్నానం లేదు. గుడ్డలు మార్చలేదు. తల, ఒళ్ళు పూర్తిగా దుమ్ము, చెమటతో నిండిపోయింది. ఒళ్ళంతా పగిలీపగలని కదువులు కట్టిన గడ్డలతో భాద. ఆహారం తినడంలేదు కనుక ఆకలి బాధ.

ఆమె బాధను చూడలేక నేను (రచయిత) ఆమెను గోనెపట్టాలో కూర్చోబెట్టి ఇద్దరు మనుష్యులం పట్టుకొని శ్రీ స్వామివారి చుట్టూ ప్రదిక్షణంగా త్రిప్పుతామని చెప్పినాము. కాని ఆమె 'చేసిన పాపం చాలక మరలా మీ చేత మోయించుకొని మరికొంత పాపం సంపాదించు కోమంటారా స్వామీ' అని చెప్పి నిరాకరించింది. కాని తాను మాత్రం చాలా నెమ్మదిగానైనా నిలుపులేకుండా రాత్రింబవళ్ళు అలా దేకుతూనే శ్రీ స్వామివారి పాకచుట్టూ తిరుగుతూనే వుంది. నేను (రచయిత) మూడవనాడు శ్రీ స్వామివారి సన్నిధికి వెళ్ళి కూర్చోగానే ఆమె వచ్చి నా ప్రక్కన నిల్చుని నన్ను పలుకరించింది. నేను ఆమెను గుర్తుపట్టలేక 'మీరెవరమ్మా' అని అడిగితే ఆమె 'మొన్న మీరు నన్ను గోనెపట్టామీద కూర్చోపెట్టి శ్రీ స్వామివారి చుట్టూ త్రిప్పుతానన్నారుగదా, ఆమెను'అని చెప్పింది. తలస్నానం చేసి మంచి చీరకట్టుకొని ఆరోగ్యంగా ఎదుట నిలచిన ఆమె శరీరం మీద ఎక్కడా ఒక్క గడ్డ కూడా లేదు. 'మీ గడ్డలన్నీ ఏమైనాయమ్మా' అని అడిగితే 'మొన్న రాత్రి కొంచెం నిద్రపట్టింది. నేను నిద్రలేచే సరికి నా ఒంటి మీద గడ్డలేకాదు నా బాధలన్నీ మటుమాయమయ్యాయి. శ్రీ స్వామివారికి నేనేమి చేసి వారి ఋణం తీర్చుకోగలను' అంటూ చెమ్మగిల్లిన కళ్ళతో తన కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేసింది. శ్రీ స్వామివారు ఆమెకు వారం రోజులు గడువు పెడితే ఆమె నిశ్చలభక్తి విశ్వాసాలతో నిర్విరామంగా శ్రీ స్వామివారి చుట్టు ఎంతో శ్రమకోర్చి దీక్షగా చేసిన ప్రదక్షిణలు మరియు నామజప ఫలితమే మూడు రోజులలోనే ఆమెకు స్వస్థత చేకూర్చింది. శ్రీ స్వామివారి కృప అనే అగ్నికి మన కృషి అనే వాయువు తోడవడమంటే ఇదే గదా!

''సంపూర్ణ విశ్వాసంతో శ్రమతో కూడిన ప్రదక్షిణలు, నామస్మరణ సత్వర ఫలితాలు పొందేందుకు మార్గమ''ని ఈ లీల ద్వారా శ్రీ స్వామివారు బోధిస్తున్నారు.

# నామస్మరణ ఫలితాన్ని తెల్పే మరొక అనుభవం

చెముడుగుంట హరిజనవాడ కాపురస్తుడు ఆయాసంతో బాధపడుతున్నాడు. వైద్యాలన్నీ విఫలమై శ్రీ స్వామివారి సమాధిని ఆశ్రయించాడు. మార్గం చెప్పమని నన్ను (రచయిత) అడిగాడు. 'ఓం నారాయణ ఆదినారాయణ' మంత్రం చెపుతూ చెట్లక్రింద రాలిపడిన చిన్న చిన్న పుల్లలను నిర్విరామంగా ఏరి కడిగి ఎండబెట్టి అగ్నిగుండంలో ఎన్నిపోస్తే అంతతొందరగా తగ్గుతుందని చెప్పాను. ఒక్క నిమిషం ఏమారకుండా రెండురోజులు అలా ఏరి పోశాడోలేదో తన బాధ కొంత తగ్గిందని తెలుసుకున్నాడు. చెట్ల క్రింద పుల్లలపై ఎంగిళ్ళు ఊసి, త్రొక్కి వుంటారని, కత్తి తీసుకొని సమీప అడవికి వెళ్ళి నామజపం ఏమారకుండా చేసుకుంటూ సాయంకాలం వరకు ఏరి చక్కని ఎండుపుల్లలు ఒకమోపు సేకరించి తెచ్చి అగ్నిగుండంలో వేయసాగాడు. అనతికాలంలో తన బాధంతా పోయిందని చెప్పాడు. కాని శ్రీ స్వామివారు శెలవియ్యకుండానే తన కుమారుని

బలవంతం పై ఇంటికి వెళ్ళి తిరిగి ఆయాసంతో మంచమెక్కాడు. మూడవనాడు తిరిగి స్వామిచెంతకొచ్చి మరలా నామజపంతో రోజంతా ఎండుపుల్లలు ఏరి అగ్నిగుండంలో వేయసాగాడు. కొంతకాలానికి శ్రీ స్వామివారి ఆజ్ఞమేరకు ఆరోగ్యవంతుడై ఇంటికి వెళ్ళాడు. ఇది మనందరికీ పాఠమే.

శ్రీ స్వామివారు తమ ఆశీస్సులు అందించే రీతులు కోకొల్లలు. కొందరు భక్తులకు కోట్లు, మణువులు, పడిగలు అని వ్రాసిన చీటీలు ప్రసాదించేవారు. కొందరికి దారం ఇస్తే మరికొందరికి సాంబ్రాణి తాకి ఇచ్చేవారు. ఇంకా కొందరిని ఏదైనా దేవాలయంలో టెంకాయ కొట్టమనేవారు. బయనబోయిన రామయ్య తన మిత్రుడు రేడియోషాపు రామచంద్రారెడ్డి గారిని శ్రీ స్వామివారు అనుగ్రహించిన చిత్రమైన విధానాన్ని వివరిస్తూ ఇలా వ్రాశారు. రామచంద్రారెడ్డిగారికి ఒక విక్రయ రిజిస్ట్రేషన్ విషయం వాయిదా పడి ఆ స్టాంపులు తీసుకొని శ్రీ స్వామివారి చెంతకొచ్చారు. రాత్రి ప్రొద్దుపోయాక వచ్చారు గనుక తన విషయం శ్రీ స్వామివారికి ఉదయాన్నే విన్నవించు కుందామని పడుకున్నారు. కానీ శ్రీ స్వామివారికి తెలియనిదేముంది. వేకువ రa◌ాఝున్నే రామచంద్రారెడ్డిగారిని పిలిచి వారి స్టాంపులు తెమ్మన్నారు. ఆముదము, విభూది కలిపి మైనంవలె చేసి దానిని రెండు అరచేతులకు, అరికాళ్ళకు పూయమన్నారు. ఆ స్టాంపుల పై తన అరచేతి, అరికాళ్ళ ముద్రలు వేసి 'ఈయన వస్తేగానీ నీ పనికాదు. ఇప్పుడు పని పూర్తి అయిపోయింది. ఇక మీరు వెంటనే వెళ్ళిపొమ్మ'ని చెప్పి 80 లక్షల ఆస్తి అని ఒక చీటి వ్రాయించి పంపారు. అనతికాలంలో ఆ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సులభంగా పని అయిపోయింది.

# బృందావన గోపాలుడు గోపికలందరికీ

ఒకే కృష్ణుడు ఎందరు గోపికలో అందరు కృష్ణులుగా ఒకే కాలంలో ప్రతి గోపిక చెంత ఆడుతూ పాడుతూ దర్శనమిచ్చిన విధంగానే శ్రీ స్వామివారు కూడా ఒకే కాలంలో అనేక మందికి దర్శనం అనుగ్రహించారు.

# జన్మజన్మల అనుబంధం

కష్టాలు తొలగించుకొనేందుకు శ్రీ స్వామివారిని సేవిస్తే ఆ కష్టాలు తొలగడంతో మనసేవ యొక్క ఫలితం కూడా రద్దవుతుంది. కానీ ఏ కష్టాలు, బాధలు, కోరికలు లేకుండా నిష్కామంగా శ్రీ స్వామివారికి చేసిన సేవ మనకు వారితో జన్మజన్మల అనుబంధం కలిగిస్తుంది. రాబోవు జన్మలలో మనం శ్రీ స్వామివారిని మరచినా వారు మాత్రం మనలను వదలరు. ఇందుకొక ఉదాహరణ.

జె.సి. పెంచలయ్య `యర్రబల్లి` (నాగుల వెల్లటూరు దగ్గర) గారి తల్లి తన చిన్న కుమారుడు శ్రీనివాసుల్ని ఆశీర్వదించమని శ్రీ స్వామివారి చెంతకు

తీసుకవెళ్ళింది. 'అమ్మో ఆయనకేమమ్మా! ఆయనకోసం మేము ముప్పయి కోట్ల తపస్సు చేశాము. ఆయన పెద్దవాడవుతాడు. మీరు కూడా గొప్పవాళ్ళవుతారు' అని ఆశీర్వదించారు.

ఆ పిల్లవాడిప్పుడు ఎం.బి.బి.యస్. చదివి ఎం.బి.బి.యస్. డాక్టరమ్మను వివాహమాడి, దంపతులిద్దరు అరేబియాలో ఒక్కొక్కరు నెలకు ఇరవై అయిదు వేల రూపాయలు సంపాదించుకుంటూ హాయిగా ఉన్నారు. ఇదంతా శ్రీ స్వామివారి ఆశీస్సుల ప్రభావము మాత్రమే.

ఏ ఋణానుబంధాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామివారా పిల్లవాని కొరకు ముప్పయి కోట్ల తపస్సు చేశారో ఎవరికెరుక? ఆ విషయం సర్వజ్ఞులైన శ్రీ స్వామివారికే తెలుస్తుంది.

## హైదరాబాద్ వాస్తవ్యులు సి.హెచ్.లక్ష్మినారాయణ (SBI ఆఫీసర్) గారి ధర్మపత్ని శ్రీమతి సీతారామలక్ష్మిగారు తనకు శ్రీ స్వామివారు ప్రాణభిక్ష పెట్టిన వివరం ఇలా వ్రాస్తున్నారు.

ఆపద సమయంలో మన పిలుపుతో నిమిత్తం లేకుండానే మనకంటే ముందు వారే జాగ్రత్తవహించి రక్షిస్తారని శ్రీస్వామివారు నిరూపించారు.

1992 వ సంవత్సరము, జనవరిలో మా వారిని బ్యాంకు ఇన్‌స్పెక్షన్ కొరకు దుర్గాపూరు వేశారు. అక్కడ మేము ఒక హోటల్‌లో మకామున్నాము. పదిహేను రోజుల నుండి నాకు విపరీతమైన జ్వరము 1040 ఉండి వళ్ళు తెలియకుండా వుంది. హోటలులో పలుకరించే దిక్కులేరు. మావారు ఉదయం డ్యూటీకి వెళ్ళితే ఇక రాత్రికే తిరిగి వచ్చేవారు. ముగ్గురు డాక్టర్లను మార్చినా కొంచెం కూడా నెమ్మదించలేదు. ఆరోజు నాకు చాలా బలహీనంగా ఉంది. మగతగా మంచంలో ఉన్నాను. నాకొక స్వప్నం వచ్చింది. అది స్వప్నమా! నాకు గోచరించింది దృశ్యమా! చెప్పలేను. ఒక సన్నని వృద్ధుడు చాపపరుచుకొని నా మంచం ప్రక్కన పడుకుంటున్నాడు. 'తాతగారు ఇక్కడ పడుకుంటున్నారేమిటి' అని అడిగాను. 'నీవు ఒక్కదానివి వున్నావు కదా నీకు సాయంగా పడుకుంటున్నాను' అని అన్నాడు.

తరువాత సీనులో నేను ఎక్కడికో వెళుతున్నాను. నా ఎదురుగా యమధర్మరాజు దర్బారులో సింహాసనము పై కూర్చునియున్నవాడల్లా దిగి నాకు ఎదురుగా వస్తున్నాడు. 'ఎక్కడికి వస్తున్నారు?' అని అడిగితే 'నిన్ను చూడడానికి' అని జవాబిచ్చారు.

ఆ తరువాత సీనులో ఇద్దరు యమభటులు పెద్దపొడుగాటి ఇనుప చువ్వలాంటిది పట్టుకొని నా మంచం దగ్గరకు వస్తున్నారు. నా ప్రక్కన పడుకున్న

ముసలాయన ఆ యమభటులను 'ఎక్కడికి వస్తున్నారు?' అని నిలేశారు. 'ఈ అమ్మాయిని తీసుకొని వెళ్ళటానికి' అని అన్నారు. 'అట్లయితే ముందు నన్ను తీసుకుపొండి. తర్వాత ఆ అమ్మాయిని తీసుకుపోదురు' అని అన్నారు. యమభటులు తమ పాశంతో ఆ ముసలాయనను కాళ్ళ దగ్గరనుండి మెడ వరకు చుట్టి బంధించి లాగుతున్నారు. వారు తమ శక్తినంతా ఉపయోగించి లాగి, లాగి అలసి ఆయాసపడి పోయారు. కానీ తాతగారిని కదిలించలేకపోయారు. 'క్షమించండి స్వామీ' అని చెప్పి వెళ్ళిపోయారు. తాతగారికి నడుము దగ్గర యమపాశం వరుసుకొని లోతుగా పుండయింది. నేను కొబ్బరినూనె తీసికెళ్ళి 'రాస్తాను స్వామీ' అన్నాను. 'నీవు భరించలేవు గదమ్మా అందుకని' అని చెప్పి అంతర్థానమయ్యారు. మెలుకువ వచ్చేసరికి నాకు జ్వరం తగ్గి నెమ్మదిగా వుంది. ఆ తాతగారు శ్రీ వెంకయ్య స్వామివారని, వారు నాకావిధంగా పునర్జన్మనిచ్చారని తెలిసింది. నేను, నా కుటుంబము ఆజన్మాంతము శ్రీ స్వామివారికి ఋణపడియున్నాము. కోరిన వారిని కోరిన విధంగా తన కృపను వర్షింప చేసే కృపాకరుడు శ్రీ స్వామివారు.

**శ్రీ వి.బాలక్రిష్ణయ్య, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ (నెల్లూరు)గారి భార్య విమలమ్మగారు తన దివ్యానుభవాన్ని ఇలా వివరిస్తున్నారు.**

శ్రీ స్వామివారిని గూర్చి శ్రీ భరద్వాజ మాస్టర్‌గారి ద్వారా తెలుసుకున్నాను. కానీ నేనప్పటికి గొలగమూడి రాలేదు. 1989 వ సంవత్సరములో నేను శ్రీ స్వామివారికి ఇలా విన్నవించుకున్నాను. 'స్వామీ నేను మీ 'అవధూతలీల' గ్రంథాన్ని శ్రద్ధగా మూడుపారాయణలు చేసుకుంటాను. నా పారాయణ అనంతరం, మా ఇంటిలోని పారిజాత చెట్టు దగ్గర అలికి ముగ్గులు పెట్టిన స్థలంలో కూర్చొని తమరు నా పిలుపు లేకుండానే నా ఆతిథ్యం స్వీకరించాలి. అది ఖచ్చితంగా గం॥12.30 ని॥ల నుండి గం॥ 1.30 ని॥ ల మధ్యనే రావాలి' అని విన్నవించుకొని పారాయణ పూర్తిచేసి వంట చేసి వారి రాకకోసం ఎదురుచూస్తున్నాను. 1 గం॥ అయినా వారి జాడేలేదు. నాకు చాలా బాధేసి 'ఏమి స్వామి నా పారాయణంతా వ్యర్థమేనా? నా తప్పేమి తండ్రీ' అని బాధపడ్డాను. నా బాధ చూచి మా ప్రక్కింటామె ఎవరైనా భిక్షగాళ్ళను పిలుచుకవస్తానన్నది. కానీ నేనే అంగీకరించలేదు. ఇంటిలోని పటాల దగ్గర కూర్చోగానే 'అమ్మా' అన్న కమ్మని పిలుపు వీధి గుమ్మం దగ్గర వినిపించి ఆత్రుతగా వెళ్ళాను. మోకాళ్ళ వరకు ధోవతి, చిన్నతువ్వాలు, కాకిచొక్కా వేసుకొని, చేతిలో కర్ర, మరొక చేతిలో అల్యూమినియం దబర పట్టుకొనిన వ్యక్తి 'అమ్మా అంత అన్నం పెడతావా' అంటూ కమ్మని కంఠంతో అర్థిస్తున్న స్వామిని చూడగానే ఆనందాశ్చర్యాలు ముప్పిరిగొనగా నా శరీరం అదుపు తప్పి పోయింది. 'రండి స్వామీ భోంచేస్తురు' అని స్వాగతం పలుకుతూ వారిని లోనికి ఆహ్వానించాను. నేను ముందు, వారు వెనుక

నడుస్తున్నాము. ఆ ఆనంద పారవశ్యంలో నేను భూమి మీద నడుస్తున్నానా లేక గాలిలో తేలిపోతున్నానో తెలియడంలేదు. పరుగున ఇంట్లోకి వెళ్ళి పొంగలి, అన్నం కూరా వగైరా తెచ్చేలోగా శ్రీ స్వామివారు మరొక్కసారి నన్నాశ్చర్యంలో ముంచేశారు. శ్రీ స్వామివారు వరండాలో కూర్చొనుంటారనుకుంటూ వచ్చాను. కానీ శ్రీ స్వామివారు చిత్రంగా పారిజాత చెట్టు దగ్గర నేను అలికి ముగ్గులు పెట్టినతావులోనే హాయిగా కూర్చొని వున్నారు. మామూలు భిక్షకుడైతే అక్కడ కూర్చునేందుకు సాహసించడుగదా? అన్నం దబరలో పెట్టమన్నారు. కానీ నా ప్రార్థన మన్నించి విస్తరిలోనే వడ్డించు కున్నారు. అరచేతిని గుంటగాపట్టి నెయ్యి పోయించుకున్నారు. తన చేతిని అన్నం మీద చిత్రంగా అలా ఇలా రెండు సార్లు త్రిప్పి ఎక్కువ అన్నం విస్తరి చుట్టు కట్టగా నిలిపారు. మధ్యలో అన్నం ఒక్క క్షణంలో తినేసి చేయి కడిగేశారు. పోతూ పోతూ వెనక్కు తిరిగి 'దక్షిణ కుక్షిణ ఏమైనా ఇస్తావమ్మా' అనడిగారు. నేను ఆనందాశ్చర్యాలతో డోలలాడుతూ దక్షిణ సమర్పించి సాష్టాంగ నమస్కారం చేసుకున్నాను. అప్పుడు వారు నా తలపై చేయి పెట్టి నన్నాశీర్వదించారు. దాంతో నా తలంతా దిమ్మెక్కి ఆనందానుభూతితో నిండి బాహ్య ప్రపంచమే తెలియకుండా పోయింది. ఆ ఆనందపారవశ్యం కొన్నాళ్ళ వరకు అలాగే ఉండి క్రమేణా మామూలు స్థితికి వచ్చాను. నేను వారికి వీడ్కోలు చెబుతూ వారి వెనకాలే మూడిరడ్లు దాటినంత వరకు రోడ్డున వెళ్ళాను. నా కళ్ళముందే స్వామివారు చిత్రంగా మాయమయ్యారు. పారిజాత చెట్టు దగ్గరే కూర్చోవాలని గం|| 12.30 ని||ల నుండి గం|| 1.30 ని|| ల మధ్యనే రావాలని నేను పెట్టిన షరతులన్నీ జరిగినా ఈ వచ్చిన వారు శ్రీ స్వామిని పోలిన మరొకరై వుండవచ్చేమోనని నేను అనుమానపడే ప్రమాదముంది. అది గుర్తెరిగి వచ్చినది స్వయంగా శ్రీ స్వామి వారేనని నిరూపించుటకే ఆ విధంగా అదృశ్యమయ్యారని నా విశ్వాసము. రెండవది వారు ప్రసాదించిన ఆనందానుభూతి. పిలిచిన వెంటనే నన్నునుగ్రహించిన ప్రేమమూర్తికి ఆజన్మాంతం నేను ఋణపడియున్నాను.

## మహత్తర దిల్‌కేబాత్ అయిన బోధ

11-2-03 రాత్రి 2-45 గం|| లప్పుడు మందిరానికి నిత్య కార్యక్రమమునకు పోతున్నాను. మా మిత్రుడు కట్టించే బిల్డింగులో ఫ్లోరింగ్ వేయని రూములో సెంట్రింగ్ పనివాళ్ళు పడుకొని నిద్రపోతున్నారు. 'అయ్యో నేల చదరంగా కూడా లేదే. 4,5 కిలోల సిమెంటుతో ఆ నేల చదును చేయించితే ఎంత బాగుంటుంది. దీనిని ఎలా చదును చేయించాలి, ఎవరి చేత ఎప్పుడు చేయించాలి', అని ఆలోచనలు తీవ్రంగా మనసులో ఒక రెండు నిమిషాలు సాగగానే - అప్పటి వరకు బాగున్న నాకు తీవ్రంగా చాలా పెద్దగా తుమ్ములు రాసాగాయి. తలకాయ లోపల జీవకణాలన్నీ పెద్ద కుదుపుకు గురైనట్లు తిక్కపుడుతుంది. అయ్యో ఇప్పటి వరకు ఆయాసం కూడా లేకుండా బాగుంది కాదా?

ఏమిటి స్వామీ? అని ఒక్కసారి శ్రీ స్వామివారిని స్మరిస్తూ నడుస్తున్నాను. తుమ్ముతున్నాను. ఒక్క సారి ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రిందట మా కుమార్తె చెప్పిన విషయం గుర్తొచ్చింది. వాళ్ళ ఆఫీసులో ఒక గుమస్తాను ఇదేమిటండీ ఇలా వ్రాస్తారు? అని ప్రశ్నార్థకంగా చూచినా చాలట. వెంటనే ఆయనకు విపరీతమైన ఆయాసమొచ్చి ఆస్పత్రికి తీసుకుపోవాలట. అంటే మెదడులోని జీవకణాలు ఏ మాత్రం కుదుపుకు గురైనా ఆయాసం వస్తుంది. అది ఆయన తత్వం. అందరికీ అలారాదు. ఇప్పుడు నేను సెంట్రింగ్ పనివాళ్ళు పడుకోనుండే రూముకు నేల ఎలా చదును చేయించాలి? ఎప్పుడు? ఎవరి చేత? అనే ఆలోచన వలన మెదడులో అలజడి జరిగి తుమ్ములు వచ్చాయి. 'ఆ గుమస్తాకు ఆలోచన వలన ఆయాసమొస్తే, అదే ఆలోచనల వలన నాకు తుమ్ములు వచ్చాయి' అని తోచి శ్రీ స్వామి వారికి విన్నవించుకున్నాను. 'తండ్రీ! నా ఆలోచనలే నా తుమ్ములకు కారణమైతే ఈ క్షణంలో లేకుండా పోవాలి. అప్పుడు మీరు చెప్పినట్లు నిశ్చలంగా కూర్చోవాలని నిర్ణయించుకుంటాను. తమరు కృప చూపితే నిశ్చలంగా కూర్చుంటాను' అని చెప్పుకున్నాను. అతి చిత్రంగా ఒక్క తుమ్మూ రాలేదు. కనుక ఆలోచనలతో కాలం వృధా చేసుకోకుండా ఆలోచనలన్నీ తనకు సమర్పించి మనలను నిశ్చలంగా కూర్చొని అనంతమైన మేలు పొందమని ఆ కరుణామయుడు బోధిస్తున్నాడని తెలిసింది. 'ప్రభూ! తమరు బోధిస్తూనే ఉన్నారు. నేను మాత్రం ఆ బోధనందుకుని కూడా ఆచరించే శక్తిలేక సతమతమై జీవచ్ఛవÛముగా బ్రతుకుతున్నాను.' అని వేడుకున్నాను.

1. పెద్దిశెట్టి సోమయ్య (పెనుబర్తి) పెంచలకోన దగ్గర కాటేరు వల్ల పుట్టిన పిల్లలు చనిపోతూ ఉంటే ఒకసారి శ్రీ స్వామివారికి విన్నవించడమైనది. ఆ తరువాత పుట్టిన పిల్లలందరు జీవించారు.

2. సోమయ్యకు చింతచెట్టు, మునగ చెట్టు వేసుకోమని స్వామివారు ఒక కటవ చూపించారు. అవి వేసుకున్నందు వల్ల ప్రయోజనమేమిటి అని అనుకుంటూనే, స్వామి చెప్పారు గదా అని వేయడం జరిగింది. కొద్ది రోజులకి ఆ కటవ మీదుగా తెలుగు గంగ కాలువ వచ్చి ఆ స్థలమునకు ప్రభుత్వం వారు డబ్బులు ఇచ్చారు. సోమయ్యకు ఒక చెట్టుకు వేల రూపాయల వంతున ప్రభుత్వం చెల్లించింది.

3. సోమయ్య కుమారుడు వెంకట నరసయ్య తరచూ పెనుబర్తికి స్వామి వస్తూంటే దర్శిస్తుండే వారు. వెంకట నరసయ్య అదే గ్రామానికి చెందిన అమ్మాయితో తన వివాహము నిశ్చయం చేసుకొని శుభలేఖలు ముద్రించి మొదటి శుభలేఖను స్వామి వారికివ్వాలని స్వామి దగ్గరకు తీసుకొని వచ్చాడు. వివాహ విషయం అనగానే స్వామి వారు వెంకటనరసయ్యతో, ''వెంకట నరసయ్యా! నేను ఒక మాట చెపుతాను ఇంటావా?'' అని అనగా, 'చెప్పండి స్వామీ' అని బదులిచ్చాడు. అంతట స్వామివారు

‘అతనితో నీవు వివాహము నీ గ్రామానికి పది ఆమడల దూరములో ఏ దిక్కున చేసుకున్నా నువ్వు బాగుపడతావు. పది ఆమడల లోపల వివాహము చేసుకుంటే జీవిత కాలం కష్టపడవలసి వస్తుంది. నీ చివర జీవితంలో మాత్రం నీకు మేలు జరుగుతుంది’ అని చెప్పారు. అప్పటికే వివాహం నిశ్చయమై శుభలేఖలు ముద్రించి నందు వల్ల వేరే వివాహము వద్దనుకుని అదే గ్రామమైనందు వల్ల పరువు ప్రతిష్టలు దెబ్బతింటాయని శ్రీ స్వామివారి మాటను పాటించ కుండా, ఆ వివాహమే చేసుకొన్నాడు. ఇప్పటికీ అతను కష్టాలు పడుతూనే వున్నాడు.

4. ఒక సారి వెంకట నరసయ్య తన తోటలో మినుముల పంటవేసాడు. మినుము బాగా పండితే శ్రీ స్వామివారికి మినుములు ఇస్తానని మ్రొక్కుకొన్నాడు. మినుములు బాగా పండి అన్నీ అమ్ము కున్నారే గాని శ్రీ స్వామి వారి మొక్కు మాత్రం చెల్లించలేదు. కొంత కాలం గడిచిన్పటికి అతను తన మొక్కు విషయం మరచిపోయాడు. అతను ఒకనాడు తనతోటలో మధ్యాహ్న సమయములో మోటారు వేసి కొంచెం దూరములో షెడ్డులో నిద్రించుచుండగా కలలో శ్రీ స్వామివారు కనిపించి, తన సేవకులతో ఆ మోటారును కాల్చేయండి అని అన్నారు. అంతలో అతనికి మెలుకువ వచ్చి ‘స్వామీ ఏమిటి ఇలా అన్నారే’ అని పరిగెత్తుకుంటూ మోటారు దగ్గరకు పోగా అప్పటికే మోటారు కాలి పొగలు వచ్చుచుండెను. ఎంతకాలమైనప్పటికి తన మొక్కు విషయం మరచి మినుములు మొత్తం అమ్ముకొని తిన్నందు వల్ల స్వామివారు ఇలా శిక్ష విధించారని తెలుసుకొని వెంటనే స్వామి దగ్గరకు వచ్చి తాను ఇస్తానన్న మినుములు ఖరీదును చెల్లించాడు. మ్రొక్కులు చెల్లించకుంటే కష్టాలు వస్తాయి అన్న శ్రీ సాయి వాక్యము యదార్థమని ఈ సంఘటన వలన తెలుస్తుంది.

**5. చల్లా సునీత, గిలకపాడు గ్రామం, రాపూరు మండలం:** శ్రీవెంకయ్యస్వామి వారి సర్వజ్ఞత్వం, సర్వ వ్యాపకత్వం, సర్వసమర్థత్వంతో పాటు ఆయన ప్రేమను నా అనుభవాలలో అనేక సార్లు చవిచూశాను. వాటిలో ఒక అనుభవం.

M.Sc చదివేటప్పుడు నాకు టైఫాయిడ్ వచ్చి, తగ్గిన తర్వాత తలనొప్పితో బాధ పడుతున్నాను. అప్పుడు వినాయకచవితి పండుగ నాడు వినాయకునికి ఇట్లా మొక్కుకున్నాను. ‘‘మీరు సాయిబాబా ఒకరే అయితే (ఒకరేనని చాలా మంది అనుభవాలున్నాయి) నాకు తలనొప్పి తగ్గించండి. నేను వచ్చే వినాయక చవితికి గురుచరిత్ర ఏకాహ పారాయణం ఉపవాసంతో చేస్తాను’’ అని చెప్పుకున్నాను. అలా నేను మొక్కుకున్నప్పటి నుండి తలనొప్పి తగ్గు ముఖం పట్టింది. నేను అంతకు ముందు తలనొప్పికి డాక్టర్ల దగ్గరకు వెళ్ళడం, అద్దాలు వాడడం జరిగినా తలనొప్పి తగ్గలేదు. కానీ ఇప్పుడు పూర్తిగా తలనొప్పి తగ్గింది. అద్దాలు పెట్టడం మానేశాను. అలానే నేను మొక్కును శ్రీస్వామివారికి, వినాయక స్వామికి చెల్లించుకున్నాను. అలా తగ్గిన తలనొప్పి

ఒక సంవత్సరానికి మళ్ళీ వచ్చింది. అంటే నా M.Sc చదువు అయిపోయి, నేను గొలగమూడిలో వుంటూ శ్రీస్వామివారిని సేవించుకుంటూ ఉన్నప్పుడు తలనొప్పి వచ్చింది. శ్రీ సుబ్బరామయ్య సార్ ఆహారలోపమని ఇచ్చిన సలహాతో పథ్యం వుంటూ వచ్చాను. తలనొప్పి తగ్గింది. ఈ రోజుల్లోనే శ్రీసాయి మాష్టర్ నిలయానికి ఒకామె శ్రీస్వామివారి దర్శనార్థం వచ్చి నా తలనొప్పి బాధ విని, ''శ్రీస్వామివారి ధునికి గుమ్మడికాయ సమర్పించు కుంటాను నా తలనొప్పి తగ్గించు తండ్రీ'' అని మొక్కుకోమన్నది. నేను అలానే శ్రీస్వామివారికి మొక్కాను. అప్పుడు రాత్రి పది గంటలు. నేను పడుకునే ముందు ఆమె నాకు చెప్పింది. నేను పడుకునే శ్రీస్వామివారికి మొక్కుకున్నాను ఇలా - ''స్వామి తలనొప్పి తగ్గించు నేను మీకు గుమ్మడికాయ (తినేది) సమర్పించుకుంటాను'' అని. అలానే నా తలనొప్పి తగ్గింది. నేను ఎంత చదివినా నాకు తలనొప్పి మాటే గుర్తు లేనంతగా చేసేశారు. తర్వాత మరలా తలనొప్పి విపరీతంగా వచ్చేసింది. భరించలేనంతగా, తలను తాకినా బాధే, 24 గంటలు తలనొప్పితో బాధ పడుతున్నాను. శ్రీసుబ్బరామయ్య సార్‌కు చెప్పుకున్నాను. సార్ ''ఏమైనా మొక్కుకున్నావేమో గుర్తు తెచ్చుకో'' అని అడిగారు. నేను మొక్కుకొన్న విషయం గుర్తులేక, 'నేను మొక్కలేదు సార్' అని చెప్పాను. తర్వాత డాక్టరును కూడా సంప్రదించి టాబ్లెట్స్ వాడాను. ఇంకా ఎక్కువగానే వుంది. నా తలనొప్పి వచ్చిన వారం రోజులకు ముందు మొక్కుకోమని చెప్పిన ఆమె మరలా శ్రీస్వామివారి దర్శనార్థం శ్రీసాయి మాష్టర్ నిలయానికి వచ్చి నా బాధ చూసి, ''నేను చెప్పాను కదమ్మా, శ్రీస్వామివారికి మొక్కావా?'' అని అడిగింది. అప్పుడు గుర్తుకు వచ్చింది. అప్పుడు కూడా అదే టైమ్ రాత్రి 10 గంటలు దాటింది. నేను పడుకునే ముందు శ్రీస్వామివారికి ఇలా చెప్పుకున్నాను. ''స్వామి నేను మొక్కుకున్న విషయం మరచాను దయచేసి క్షమించు. నేను మొక్కును తీర్చుకుంటాను. నా తలనొప్పి వుదయంకల్లా తగ్గాలి'' అని చెప్పుకుని పడుకున్నాను. అలానే ఉదయం లేచేసరికి నాకు తలనొప్పి 50% తగ్గి ఆరతి కూడా పెద్దగా పాడడం జరిగింది. అంటే అంతకు ముందు మాట్లాడినా తలనొప్పికి తట్టుకోలేను. తర్వాత శ్రీసుబ్బరామయ్యసార్‌కు చెప్పుకున్నాను- 'సార్ నేను స్వామివారి మొక్కును మరచాను' అని. సార్ ''ఆయన మొక్కును తీర్చేయమ్మా తొందరగా'' అన్నారు. నేను మరుసటి రోజు అంటే బుధవారం స్వామివారికి గుమ్మడికాయ (మా అన్నయ్య తెచ్చివ్వగా) ధునికి సమర్పించుకున్నాను. మరుసటిరోజు నుండి నా తలనొప్పి తీసేసినట్లు పోయింది. అంటే శ్రీస్వామివారి సర్వజ్ఞత్వం చూడండి. నేను పడుకునే టప్పుడు మొక్కిన మొక్కును గుర్తుంచుకున్నారు. నామాట విన్నారు. అలానే మొక్కును తీర్చుతాను అని మరలా బాధతో విన్నవించు కున్నదీ విన్నారు. నాకు తలనొప్పి తీసేశారు.

నాకు మొక్కును చెప్పిన ఆమెను తీసుకు వచ్చి నాకు గుర్తు చేయించి మరీ మొక్కును తీర్చుకుని నాకు తలనొప్పి పోగొట్టిన సర్వ సమర్థుడు శ్రీస్వామివారు.

6. వెంకటనరసయ్య కుమారుడు సుబ్బారావు పుట్టినప్పుడు కళ్లుతెరవ కుండా అలాగే ఉండసాగెను. డాక్టర్లకి చూపించినప్పటికీ కళ్లు రావని చెప్పారు. సుబ్బారావుని వాళ్ల అవ్వ స్వామి దగ్గరకు తీసుకొని వచ్చి స్వామి వారికి విన్నవించెను. అప్పటికి సుబ్బారావు వెంట్రుక వాసి మందాన కళ్లు తెరవడం ప్రారంభించెను. 'పిల్లవాడు పెద్దయ్యే కొద్ది కళ్లు వస్తాయి లేమ్మా' అన్న శ్రీ స్వామివారి మాట ఈనాటికి సుబ్బారావుగారి విషయంలో యదార్థమై కళ్ళు క్రమేణా తెరచుకుని చూపు వచ్చింది. (ఇప్పుడు అతని వయస్సు 30 సం॥లు)

7. తిరగాబత్తిన రోశమ్మ ఒకనాడు స్వామివారిని గూర్చి వెంకట నరసయ్య కుమారుడు సుబ్బారావు గారితో ఈ విధంగా చెప్పినది. స్వామివారు పెనుబర్తికి వచ్చినప్పుడు నాకు అప్పుడే పెళ్ళి అయినది. అందరూ 'స్వామి వచ్చిఉన్నాడు దర్శనం చేసుకుందాం రండి' అంటూ పోతూ ఉంటే నేను వాళ్లందరిని చూచి 'పిచ్చివాళ్లలాగా వున్నారు' అనుకొని నేను కూడా స్వామి దగ్గరకు పోయాను. ఆయనను చూసి 'ఈయనేమి స్వామి' అని అనుకుంటూ దూరంగా నిలబడినాను. స్వామివారు నన్ను చూచి ''అమ్మా గుట్టలు గుట్టలుగా మోసుకొచ్చుకున్నావే! ఇదంతా ఎప్పుడు అనుభవిస్తావు?'' అని అన్నారు. ఆయన మాటలు నాకు ఆనాడు ఏమీ అర్థం కాలేదు. (నారాతలో పాపం ఆ విధంగా ఉందని) తరువాత నాకు ఒక కొడుకు, కూతురు పుట్టిన తరువాత కొంతకాలానికి నా భర్త చనిపోయెను. ఇంకొంత కాలానికి నా కొడుకు ఇంటర్‌లో చదువు విషయంలో ఏదో పొరపాటు జరిగి ఆత్మహత్య చేసుకొన్నాడు. నా కుమార్తెకు వివాహం చేసాను. కొంత కాలానికి ఆ అమ్మాయికి పిచ్చిపట్టినందు వల్ల భర్త నా దగ్గరే వదిలి వేశాడు. ఇప్పుడు ఆ అమ్మాయి నన్ను మానసికంగా వేధిస్తూ వుంటే ఏ మగదిక్కులేక కూలికి పోయి పని చేసుకుంటున్నాను. స్వామివారిని ఆనాడే ఈ పాపం పోయే మార్గం ఏమిటి అని అడిగి ఉంటే ఈనాడు ఇంత బాధలు పడేదానిని కాదేమోననిపిస్తుంది.

ఇలాంటివి జరిగినప్పుడు వాళ్ళ రాతలో అలా జరగాలని వుంది. శ్రీ స్వామి చేసిందేమి లేదు అనేవాళ్ళు కూడా ఉన్నారు. కాని దేవుని నమ్మని మనిషికి దేవుని యందు విశ్వాసం కలిగించి పది మందికి దేవుని గూర్చి చెప్పేటట్లు చేయడం శ్రీ స్వామివారి గొప్పదనం.

## కె.వి. రవికుమార్‌కు కల్గిన అనుభవం

నా పేరు కె.వి.రవికుమార్, మాది తార్లపాడు గ్రామం. నేను గుంటూరులో యమ్.యమ్.యమ్. రెండో సం|| చదువుతున్నాను. నేను, మా స్నేహతుడు వీరాంజనేయులు ఇద్దరం కలిసి కృష్ణనగర్ మొదటి లైన్ నుండి నడుచుకుంటూ వెళుతుండగా మధ్యలో శ్రీ వెంకయ్య స్వామి వారి ఆలయం వచ్చినది. మా స్నేహితుడు వెళదామని చెప్పగా 'సందు, సందుకి స్వాములు వుంటారు. అందరిని నమ్మకూడదు' అని నా అభిప్రాయం చెప్పాను. కాని మా స్నేహితుడి కోరిక పై అక్కడికి వెళ్ళకుండా వుండలేక పోయాను. కాని అదే మొదటి సారి నేను అక్కడికి వెళ్ళడం. నాకు తెలియ కుండానే నాకు మంచి రోజులు మొదలయ్యాయని తెలిసింది. నాకు విదేశాలకు వెళ్ళాలని కోరిక లేదు. కాని నాకు అడక్కుండా ఆ అవకాశం వచ్చింది. నేను ఒక్కసారి మరల వెంకయ్యస్వామి గుడికి వెళ్ళి ఆయన మీద భారం వేశాను. ఆయన అనుగ్రహం వలన ఎలాంటి ఇబ్బంది లేకుండా నాకు చాలా త్వరగా వీసా వచ్చింది. నేను వెంటనే మెడికల్ టెస్టులు చేయించుకుని గొలగమూడికి వచ్చితిని. నేను దూషించిన స్వామి నాకు ఇంతటి గొప్పకార్యం విజయవంతం అయ్యే విధంగా నాకు అనుగ్రహం ఇచ్చారు. అలా వెంకయ్య స్వామి భక్తుడిగా రెండు సార్లు గొలగమూడి వచ్చాను. నాకు ఏ సంకల్పం కలిగినా వెంకయ్యస్వామికి తెల్పి ముందుకు అడుగులేస్తున్నాను. అంతేకాకుండా స్వామి గురించి కువైట్‌లో కూడా మన ఇండియన్స్ కు తెలియచేసి వాళ్ళు కూడా ఆయన కృపకు పాత్రులు కావలెనని స్వామివారిని వేడుకుంటున్నాను.

### వంటిపల్లి మోహనరావు - దమ్మపేట

మా గ్రామంలో మా జాయింటు కుటుంబపు ఆస్తుల విషయం మాట్లాడుకునే సమయంలో మధ్యహ్నాం 12గం|| హారతికి సమయము అవుతుంది. నేను చాలా ఆందోళన పడుతున్నాను. పంచాయితీ చేసే పెద్దమనిషి పన్నెండుకు రెండు నిమిషాల ముందే లేచి మరొక పంచాయతీకి పోవాలని మా పంచాయతీ వాయిదా వేశాడు. మధ్యాహ్న హారతి నాకు ఏ ఆటంకము లేకుండా జరుపుకొన్నాను. సర్వభూత హృదయాంతర్వర్తి అయిన శ్రీ స్వామివారు మనము ప్రార్థించక పోయినా మన పవిత్రమైన కోరికలు తీరుస్తుంటారు.

## అర్థంకాని శీ స్వామివారి దివ్యవాణి

తిరుమల శెట్టి వెంకయ్య అనుభవం- ఆ రోజుల్లో నేను తులసమ్మగారితో కూడా పనిచేసే వాడినే కానీ శ్రీ స్వామివారి దగ్గర ఉండేవాడిని కాను. ఒక రోజు శ్రీ స్వామివారు ''మొదటి కయ్యకూడా కొంచెం చూచుకోవయ్యా'' నేనెప్పుడూ సేద్యం చేస్తుంటాను గనుక నాకు బాగా అర్థమవుతుందని తనను మొదటికయ్యగా పోల్చుకొని చెప్పారు.

అదేవిధంగా మరొకరోజు శ్రీ స్వామివారు ''నాగయ్య మొదటి పూజారిగా వుంటాడు. నీవు రెండవ పూజారిగా ఉండయ్యా'' అన్నారు. 'నేను సేద్యము చేసుకునే వాణ్ణి. పూజారి అవడం ఏమిటి' అని విస్తుపోయాను. కాని కాలాంతరములో బరిగెల నాగయ్య పూజారిగాను, నేను వారికి సహాయకుడిగాను సమాధి మందిరంలో పనిచేసేటప్పుడు పై మాటలకు అర్థం తెలిసినది.

చిట్టెపల్లెలో శ్రీ స్వామివారు ''అయ్యా మీ వాళ్ళు నన్ను వదలినా నేను వాళ్ళను వదలనులేయ్యా'' అన్నారు. కాలాంతరములో వేలకు వేల జనం గొలగమూడి దర్శిస్తున్నా మా వాళ్ళు ఎప్పుడో ఆరాధనకు తప్ప మిగిలిన కాలంలో శ్రీ స్వామివారిని కలవరు కానీ శ్రీ స్వామివారి దయవల్ల వాళ్ళంతా సిరిసంపదలతో హాయిగా వున్నారు.

## జలగస్వామి

జలగ పట్టుకుంటే వదలదు. శ్రీ స్వామివారు అంటారు ''మీరు నన్ను వదలినా నేను మిమ్ములను వదలనయ్యా'' శ్రీ స్వామివారు మనలను ఎప్పుడు పట్టుకుంటారు? మన ఖాతాలో పాపంకంటే పుణ్యం ఎక్కువ ఉంటే వారి కృప కలుగుతుంది. పుణ్యమంటే ఏది? పాపమంటే ఏది? అంటే వేమనగారు చెపుతారు. ''ఏ జీవికి ఉపకారం చేసినా పుణ్యమే. ఏ జీవికి అపకారం చేసినా పాపమే''. ''అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకో''మన్నారు శ్రీ స్వామి. కనుక శత్రుమిత్రులు, ధనవంతులు, పేదవారు అనే భేదం లేకుండా వాళ్ళు అడగకుండానే మనం సహాయం చేయడం. సూర్యుడు ఎండను, మేఘుడు వర్షాన్ని, చంద్రుడు చల్లదనాన్ని ఇచ్చు రీతిన అందరికీ సహకరించడమే పుణ్యం. ఆకలి తీర్చడమొక్కటి మాత్రమే కాదు. మన వల్ల అయ్యే మాటసహాయం, ధనసహాయం చేయడం కూడా పుణ్యమే.

## బాధ ఎంత భరిస్తే అంత మంచిదయ్యా

శ్రీ స్వామివారు మనం అడిగింది చేయలేదని వారి మీద అలిగి వారి సేవలు మానరాదు. ''బాధ ఎంత అనుభవిస్తే అంత మంచిది గదయ్యా''. శారీరకబాధలేగాక, మానసిక బాధలు, ఆర్థిక బాధలు అన్నీ ఇందులోకే వస్తాయి. మనకు మంచిది కానిది శ్రీ స్వామివారు ఏదీచేయరు. మనం కోరింది మన ఆర్థిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి మంచిదైతేనే చేస్తారు. లేకుంటే చేయరు. బాధ ఎంత ఓర్చుకుంటే అంతమంచిదన్నారు గదా! కొందరు భక్తులు ప్రతివారం వచ్చి శ్రీ స్వామివారిని దర్శిస్తూ తమకెంతో మేలు శ్రీ స్వామి చేశారని చెపుతూ షడన్‌గా శ్రీ స్వామివారి మీద అలిగి రావడం మానేశారంటే కారణమేముంటుంది. వారడిగింది శ్రీ స్వామివారు చేయలేదనే వారి భావం. వారడిగింది చేస్తే వారి లౌకిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకే నష్టమౌతుందని శ్రీ స్వామివారు

అది చేయరు. ఇది తెలియక శ్రీ స్వామివారిపై అలగడం ఎంత పొరపాటో యోచించండి.

# కృతజ్ఞత 1

నెల్లూరు జ్యోతినగర్ 2వ వీధి నివాసి వయస్సు ఇరవై సంవత్సరాలు - ఆమె మనసు పనిచేయదు అలాగే చూస్తుంది. ఏదీ సరిగా తినదు. నిద్రపోదు. ఆమె టీచర్‌గా పనిచేసి సంపాదిస్తే ఇల్లు గడుస్తుంది. యంత్రతంత్రాలు, దాటింపులూ, ఆస్పత్రి వైద్యాలు అన్నీ చేయించి అప్పుల పాలైనా నయంకాలేదు. ఒకరి సలహా పై గొలగమూడి వెంకయ్య స్వామి నాశ్రయించారు. మూడవనాటికి పూర్తిగా నయమైంది. ఎందరు ఉండమని చెప్పినా వినకుండా ఇంటికి వెళ్ళారు. మూడవనాటికి తిరిగి అనారోగ్యమైంది. మరలా గొలగమూడి వచ్చారు. ఈ దఫా ఏడురోజులకు నయమైంది. తిరిగి ఇంటికి పోయారు. మరలా తిరగబెట్టింది. మరలా గొలగమూడి వచ్చారు. పదిరోజులకు కొద్దిగా తగ్గిందికాని సంపూర్ణ ఆరోగ్యం రాలేదు. ఇరవై రోజులకు పూర్తిగా నయమైంది. ఎంతో కష్టం మీద నలభై రోజులు ఉన్నారేగాని పొమ్మని శ్రీ స్వామి చెప్పినంత వరకు వుండలేదు. ఇంటికి వెళ్ళి వాళ్ళ గొడవల్లో వాళ్ళేగాని శ్రీ స్వామివారికి కృతజ్ఞతా భావంతో ఇంట్లో సేవించలేదు. ఆమెకు పెండ్లి చేశారు. మరలా మొదటిలాగానే అనారోగ్యమయింది. మరలా గొలగమూడి వచ్చారు. అనంత కరుణామయుడైన శ్రీ స్వామివారు కృప చూపారు. ఏమాత్రం జ్ఞానమున్నా శ్రీస్వామివారికి కృతజ్ఞతతో నిత్యం పారాయణ, ప్రదక్షిణలు చేస్తూ అందరిలో శ్రీ స్వామివారు ఉన్నారనే భావనతో జీవిస్తుంటే ఇన్ని మార్లు అనారోగ్యం పాలుకావడం జరిగేది కాదు.

# కృతజ్ఞత 2

తిక్కవరప్పాడు హరిజనవాడ - 22 సం|| కుర్రవానికి మూత్రంలో వీర్యం పోతున్నందున పూర్తి నిస్సత్తువ కలిగి, ఆహారం మామూలు కంటే ఎక్కువ తింటాడు, ఎప్పుడూ పడుకొని ఉంటాడు. ఇంగ్లీషు మందులు, మంత్రతంత్రాలు అయిపోయి చివరి ఆశగా శ్రీ స్వామి నాశ్రయించాడు. మూడవ రోజుకు బాగయి పోయింది. నాల్గవరోజు ఒక టెంకాయ శ్రీ స్వామికి సమర్పించి ఇంటికి వెళ్ళాడు. రెండు రోజులు బాగుండి మరలా నిస్సత్తువయింది. మరలా గొలగమూడి వస్తే ఐదవ నాటికి బాగయింది. ఆరవ రోజు ఇంటికి పోయాడు, మరలా రెండు రోజులు తర్వాత అనారోగ్యం, మరలా గొలగమూడి వస్తే ఈ దఫా పదిహేనురోజులైనా నయంకాలేదు. శ్రీ స్వామి అతనిని నా దగ్గరకు పంపారు. ఇంటికెళ్ళి ఏమి చేస్తావని అడిగితే మామూలుగా కూలికి పోతానన్నాడు. అది సరే శ్రీ స్వామికి ఏమి చేస్తావంటే ఏమీ చేయనన్నాడు.

'నీ చేలో గడ్డి మోపు నీ నెత్తి కెత్తాననుకో, నేను మీ గ్రామంలో కనిపిస్తే నీవు ముందుగా నన్ను పలకరిస్తావా లేక నేనే పలకరించాలా' అని అడిగితే `నేనే మిమ్ములను పలకరిస్తానన్నాడు. 'గడ్డిమోపు ఎత్తి నందుకే అంతగా నన్ను గుర్తుపెట్టుకున్నావే, ఏ విధంగానూ నయంగాని జబ్బునయం చేసిన శ్రీ స్వామిని ఇంకెంతగా గుర్తు పెట్టుకోవాలో ఆలోచించు. **మీ ఇంటి గోడకు శ్రీ స్వామివారి చిన్న పటం తగిలించి రోజూ ఒక సాంబ్రాణి కడ్డీ వెలిగించి నమస్కరించుకో. ప్రతిసారి అన్నం తినేటప్పుడు మొదటి ముద్ద శ్రీ స్వామివారికని తీసి బయటపెట్టు. నిత్యం వారిని ఏమారకుండా ఇలా తలుచుకో' అని చెప్పాను.** అలాగే చేస్తానని చెప్పగానే అతని వ్యాధి నయమైంది. ఈనాటికీ చక్కగా కష్టం చేస్తున్నాడు. కృతజ్ఞతా భావం ఎంత ముఖ్యమో చూడండి.

చాకలి కొండ విజయలక్ష్మిగారు, కావలి వాస్తవ్యలు ఇలా చెపుతున్నారు. నేనొక రోజు గొలగమూడిలో శ్రీ స్వామివారి దర్శనానికి వచ్చాను. వారు కొంతసేపు తంబుర మీటి మా ఇంటాయనను తీసుకరమ్మని నన్ను కొమ్మలపూడి పంపారు. వచ్చేటప్పుడు మూడులడ్లు తీసుకరమ్మన్నారు. నేనలాగే మా వారిని తీసుకవచ్చాను. లడ్లు దొరకలేదనుకొంటే బస్సులో పెండ్లికూతురు వాళ్ళు పోతుంటే వాళ్ళ దగ్గర మూడులడ్లు తీసుకవచ్చాను. ఒక లడ్డు మాకు ప్రసాదంగా ఇచ్చారు. ఒకటి అగ్నిహోత్రంలో వేశారు. ఒకదాన్ని చీమలకు పోశారు. కొంత సేపటిలో ఒక సర్పం వచ్చి మాచుట్టూ స్వామివారి అగ్నిహోత్రం చుట్టూరా తిరిగి చివరకు అగ్నిహోత్రంలో దూకి కాలి చనిపోయింది. కనుక మాకేదో సర్పగండం ఉంటే దాన్ని ఆ విధంగా తొలగించారని తలచాను.

**''అందరికి పంట పండిరచాను. దాన్ని దొంగలుపడి దోచు కోకుండా చూడండయ్యా'' అని శ్రీస్వామివారు చెప్పినమాట ఎంత నిజమో ఈ క్రింది లీల తెలుపుతుంది.**

Y. శివరామయ్య గారికి రెండు కిడ్నీలు చెడిపోయి డాక్టర్లు ''నీవిక బ్రతికేది కొన్ని రోజులే'' అని చెప్పిన టైంలో శివరామయ్య శ్రీస్వామివారిని ఆశ్రయిస్తే ''ఉప్పు లేకుండా ఒక్కపూట తినయ్యా'' అని శ్రీస్వామివారు చెప్పగా అదేవిధంగా చేసి, గత ఐదు సంవత్సరాల నుండి ఆరోగ్యంగా వున్నారు. వీరు తన జీవితాన్ని దైవచింతనలో గడపకుండా ఏవ వ్యాపకాలలో వున్నాడోగాని శ్రీస్వామివారి సంపూర్ణ అనుగ్రహం వీరికి అందడం లేదని ఈ క్రింది స్వప్నం తెలుపుతుంది.

వీరు గొలగమూడిలోని శ్రీస్వామివారి మందిరం ముందు నిలుచొనియున్నారు. పూజారి శ్రీనాగయ్యగారు వీరికి ప్రసాదమిస్తున్నారు. కానీ వీరిద్దరి మధ్య సన్నని మెష్ వుంది. ఆ మెష్ సందులలో చేతివేలు దూరడమే కష్టము. కొంతసేపు ప్రసాదం అందుకోవాలని ప్రయత్నించాడు. ఇంతలో నాగయ్యగారు వెళ్ళిపోయారు. అంటే శ్రీస్వామివారి ప్రసాదం వీరికి అందలేదని అర్థం. అందుకు కారణం ఆ మెష్ గదా. ఆ మెష్ మనలోని చెడుగుణాలు. వాటిని విడనాడనిదే సంపూర్ణ స్వామి కృప మనకు లభించదని బోధిస్తున్నారు.

ఈ శివరామయ్యగారే జిహ్వా చాపల్యము వల్లనో, సోమరితనం వల్లనో ఒకరోజు తనచేనిలో కూలీలకు తెచ్చిన కూర (ఆ కూరలో వుప్పేసి వున్నారు) కలిపిన అన్నం ఒక ముద్ద తిన్నారు. వెంటనే స్పృహ తప్పి పడిపోయాడు. మద్రాసు వెళ్ళి 26 వేల రూ|| ఖర్చుతో వైద్యం చేయించుకుని మనస్పృహలోకి వచ్చాడు. శ్రీస్వామివారి ఆజ్ఞలు ఎంత బలవత్తరమైనవో ఈ లీల మనకు తెలుపుతుంది.

**కె. విజయానంద్‌బాబు, రాజమండ్రి :** 2003 వ సంవత్సరములోను మాకు శ్రీ స్వామివారి అనుభవము మరియొకటి కలిగినది. నాకు శ్రీ స్వామివారి పై నమ్మకం కుదిరినప్పటి నుండి అనగా 2000వ సంవత్సరము ఆఖరు నుండి నేను శ్రీ స్వామివారి ఫోటోను ఎప్పుడు నా షర్టు జేబులో పెట్టుకొని, చేతికి శ్రీ స్వామివారి దారము కట్టుకొనే వాడను. మార్చి, 2003వ సంవత్సరము నందు నేను, నా భార్య, కుమారునితో తణుకులో ఒక విందుకు హాజరై తిరిగి వస్తుండగా గోదావరి నది పై గల బ్రిడ్జీపై పిచ్చుకలంక గ్రామం వద్ద మోటారు సైకిలు ఒక సిమెంటు స్తంభమునకు గుద్దుకొని, నేను, నా కుమారుడు తీవ్ర గాయములతో స్పృహతప్పి పడిపోగా, నా భార్య ఒక 20 అడుగుల దూరములో సొమ్మసిల్లి పడినది. మా కుమారుని ఏడుపునకు ఆమెకు స్పృహవచ్చి మమ్ములను చూచి ఏడ్చుచూ సహాయము కొరకై దిక్కులు చూడసాగినది. అప్పుడు సమయము సుమారు మధ్యాహ్నం 3 గం||లు. ఆ సమయములో ఒక పెళ్ళి బృందం ఆటోలో వెళ్ళుచూ మా పరిస్థితి చూచి ఆగారు. అదే సమయములో ఎవరో కారులో వెళ్ళుతూ మమ్ములను చూసి, ఆగి విషయము తెలుసుకొని వారివద్ద గల సెల్‌ఫోను ద్వారా మా ఇతర కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. ఆ సమయములో నేను తలకు హెల్‌మెట్ ధరించి యుండుటచేత పెద్ద ప్రమాదము నుండి బయట పడితిని. కాని ఆ తాకిడికి హెల్‌మెట్ పగిలి పోయినది. నా కుమారుని తలకు బలమైన గాయమయింది. కుడిచేయి విరిగింది. నాకు ఎడమ అరచేయి విరిగినది. అప్పుడు ఆ పెళ్ళి బృందం ఆటో దిగి, మాకు ఆటోను ఇవ్వగా మేము ఆస్పత్రిలో చేరాము.

కాని మేము ముగ్గురము అంగవైకల్యం లేకుండా బ్రతికి బట్టకట్టినామంటే దానికి శ్రీ వెంకయ్య స్వామి వారి దయయే కారణమని మేము నమ్ముతున్నాము. దీనికి నిదర్శనమే నా జేబులోని శ్రీ స్వామివారి ఫోటో, యాక్సిడెంట్ సమయంలో నా భార్య చేతిలో దర్శనం ఇచ్చుట. ఈ సంఘటన తరువాత నా భార్యకి శ్రీ స్వామివారి పై నమ్మకం ఏర్పడినది.

## జి.యల్.నరసింహంగారు తన భార్య రమణిని భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి రక్షించిన విధం ఇలా తెలియపరుస్తున్నారు:

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి మరో అద్భుతలీల. తనను కష్టాలలో ఆశ్రయించిన వారిపై భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారు చూపే దయను తెలియపరిచేదే ఈ క్రింది లీల.

నా భార్య రమణి చాలా కాలం నుండి తలనొప్పి, గొంతునొప్పి, జలుబు, ఆయాసం మరియు సైనస్ వ్యాధులతో బాధపడుతోంది. 2001 వ సంవత్సరములో మద్రాసులోని ప్రముఖ ఆస్పత్రిలో ఆమె ముక్కుకి, ఆపరేషన్ చేయించినా ఏ బాధలూ తగ్గకపోగా వాడిన మందుల వలన క్రొత్తగా గ్యాస్ట్రబుల్ రావటం, బరువు తగ్గటం కూడా జరిగాయి. 2002 వ సంవత్సరములో విజయనగరం సాయిసుందర మహరాజ్ గారి సలహాననుసరించి భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి సమాధిమందిరం దర్శించి మూడు రాత్రులు నిద్రచేసి స్వామిని సేవించాము. ఆశ్చర్యకరంగా ఆమె ఆరోగ్యము మెరుగైంది.

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి దయవలన 2003వ సంవత్సరములో ఆమె గర్భిణి అయ్యింది. కానీ తీవ్రమైన కడుపునొప్పి, వెన్నునొప్పి మొదలయ్యాయి. డాక్టర్లు స్కానింగ్ ద్వారా పరీక్షించి గర్భసంచిలోని గడ్డ వలన బాధలు వస్తున్నాయని చెప్పారు. పైగా గడ్డ చాలా పెద్దదవడం వలన గర్భం నిలవదని అబార్షన్ మంచిదని, లేకుంటే తల్లికి, బిడ్డకి ఇద్దరికీ ప్రమాదం అని తేల్చి చెప్పారు.

బాగా కలత చెందిన మనస్సులతో సాయిసుందర మహరాజ్ గారిని సంప్రదిస్తే ఆయన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారిని సంపూర్ణంగా ఆశ్రయించినట్లయితే వారు సర్వం సరిచూడగలరని ఈ పరిస్థితిలో రక్షించగలరని సలహాయిచ్చారు. నెలలు నిండే కొద్దీ ఈ బాధలు కూడా పెరిగాయి. గడ్డపరిమాణం పెరుగుతుండడం వలన వాంతులు, అజీర్తి, కడుపునొప్పి, వెన్ను నొప్పులు మరింతగా పెరిగాయి. మద్రాసులోని అపోలో హాస్పిటల్ డాక్టర్లు కూడా ఈ రోగిని నయం చేయలేమని తెలియపరిచారు. అప్పుడు భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి పాదతీర్థాన్ని రోజు 3 సార్లు బిడ్డ పెరుగుదలకి, తల్లి ఆరోగ్యానికిగాను శ్రద్ధ, విశ్వాసాలతో తీసుకుంటుండమని సాయిసుందర మహరాజ్ గారు సలహాయిచ్చారు.

ఈ సలహానుసరించి శ్రీ స్వామివారిని శ్రద్ధగా సేవిస్తుండగా ఒకరోజు స్వప్నంలో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి సేవకుడు స్వామి ఆశ్రమంలో పడుకున్న ఆమెపై విభూతి, తిలకం అద్ది అంతా చక్కబడుతుందన్నట్లు దర్శనమైంది.

9 నెలల 20 రోజులకు శ్రీరామనవమి రోజున (30`3`04) ఆపరేషన్ చేస్తే మగశిశువు జన్మించాడు. అత్యద్భుతంగా ఆ పెద్దగడ్డను కూడా డాక్టర్లు తీసివేయగలిగారు. ఈ విధంగా ఆపరేషన్ సఫలం అవటం, బిడ్డ, తల్లి ఆరోగ్యంగా వుండటం ముందెన్నడూ జరగలేదని ఇలా జరగటం మిలియన్లో ఒకరని డాక్టర్లు అబ్బుర పడ్డారు. గర్భసంచిలో పెద్దగడ్డ ఉండగా అసలా బిడ్డ ఎలా పెరగాడని వారు ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు. కేవలం భగవంతుడి మీద రోగికి కల భక్తి విశ్వాసాలు ఈ అరుదైన సంఘటనకి కారణమని డాక్టర్లు నొక్కిచెప్పారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా, సంతోషంగా వున్నారు.

ఈ లీల తననాశ్రయించిన భక్తులపై భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారు చూపే దయ, రక్షణలకు ప్రబల నిదర్శనం.

బిడ్డను ప్రసవించిన తర్వాత ఆ బిడ్డ రెండుకాళ్ళు వంపులు తిరిగివున్నాయి. డాక్టర్లకు చూపిస్తే 'పదిసంవత్సరముల వయస్సులో ఆపరేషన్ చేసి కాళ్ళు సరిచేయ ప్రయత్నిస్తాము. కానీ ఇది చాలా క్లిష్టమైన ఆపరేషన్ పూర్తిగా కాళ్ళు చక్కబడతాయని చెప్పలేము' అన్నారు. అది మొదలుకొని ప్రతిసంవత్సరము గొలగమూడి వచ్చి మూడు నిద్రలు చేసి స్వామివారి సమాధికి తాకిచ్చిన నూనె తీసుకొని వెళ్ళి కాళ్ళకు పూస్తూ విభూతి కూడా పూసాము. అభిషేక తీర్థము త్రాగించేవాళ్ళము. బిడ్డ వయస్సు 5 సం||లు అతని పేరు జి.యస్.పి. తేజ. ఇప్పుడు మనము నమ్మలేనంతగా కాళ్ళు చక్కగా వుండి మాములుగా నడవగలుగుతున్నాడు. స్వామివారు చెప్పినట్లు వీరి విశ్వాసమే ఆ బిడ్డ కాళ్ళను చక్కపరిచినది.

## ఆదిలో అపరాధం ఎవరిది?

వాళ్ళలా ప్రవర్తించారు. వీళ్ళలా ప్రవర్తించారు అని మన పిచ్చి మనస్సు అనేక కుంటి సాకులతో ఏవేవో ఆలోచిస్తుంటుంది. ఆలోచనా స్రవంతిని అరికట్టే మన ప్రయత్నానికి అనుక్షణమూ ఇలాంటి ఆలోచనలతో అడ్డంకులు పెడుతుంది. ఋణానుబంధం వలననే వాళ్ళలా ప్రవర్తించారు అనే జ్ఞానం పోతుంది. ఇలాంటి ధోరణికి శ్రీ మాష్టారి మంచి మందు చాలా చక్కగా పనిచేస్తుంది. అనుక్షణమూ గుర్తుండితీరవలసిన మాట. ''ఆదిలో అపరాధం ఎవరిది?'' అని ఆలోచించమన్నారు. ఇప్పుడిలా ప్రవర్తించేలా అతనిని ప్రేరేపించిన దెవరు? ఇలా ఇంకా ఎంత వెనుకకు పోగా పోగా ఆదిలో అతనిని అలా సృష్టించింది భగవంతుడే గనుక భగవంతుణ్ణి మనం తప్పు పట్టలేము. కనుక మనం అతనినేమీ చెడ్డగా తలంచేందుకు వీలులేదు. గనుక మన

ఆలోచనలన్నీ నిరర్థకమైనవని తేలుతుంది. నిరంతరం ఆదిలో అపరాధం ఎవరిది? అని ప్రశ్నించుకుంటుంటే ఆలోచనా స్రవంతిని అరికట్టవచ్చంటారు శ్రీ మాష్టారు.

# శ్రీ మాష్టారు చెప్పిన మంచికథ

ఒక సాధకుడు ఒక సద్గురువును సేవించేవాడు. అతణ్ణి సాధకుడనే కంటే సేవకుడనడం మంచిది. ఆ గురువుగారికి ఆ సేవకుడు లేకుంటే చాలా ఇబ్బందిగా ఉండేది. గురువుగారి ఆఖరు రోజులొచ్చాయి. అది వారికి తెలుసు. తన సేవకునకు గురుసేవ చేయడం తప్ప ఇంకేమీ తెలియని అమాయకుడు అని గురువుగారికి తెలుసు. ''ఓరేయ్! నేను శ్రీ దత్తప్రభువును నీకోసం పిలుస్తాను. ఆయన వస్తారు. వచ్చినప్పుడు మొదట నేను వారి పాదాలకు నమస్కరిస్తాను. నీవు కూడా నమస్కరించు నీకు మేలుజరుగుతుంది. ఐతే దత్తప్రభువు చాలా అసహ్యంగా దగ్గరకు పొయ్యేందుకు వీలులేనంత అసహ్యంగా ఉంటారు. మొదట నేను పాద నమస్కారము చేస్తాను నీవు కూడా తప్పక చేయాలి అని ముందుగా చెప్పి అలానే పిలిచారు. శ్రీ దత్తస్వామి రానే వచ్చారు. గరువుగారు  నమస్కరించారు. కానీ ఈ అమాయకుడు అసహ్యంవల్ల నమస్కరించలేదు. ఆ తర్వాత రెండవసారి అలాగే జరిగింది. మూడవసారి అంతే జరిగింది. ఈ దఫా శ్రీ దత్తస్వామి అదృశ్యం కాకముందే ఈ గురువుగారు తన సేవకుని శ్రీ దత్తస్వామి పాదాల పై తోశారు. శ్రీ దత్తస్వామి అనుగ్రహంతో అతనికి జన్మరాహిత్యం కల్గింది. కనుక మనం సాధనలో ఎలా ఉన్నా సాయికృప పొందేటట్లు ఆచరిస్తుంటే సర్వం సాయినాథుడే అనుగ్రహిస్తారు అని బోధించారు. ఈ కథనే నాకు సరిపోయిందని నిర్ణయించుకుని అలా నడుచు కోవాలని తలచేవాణ్ణి. అంతా వారి దయగాక మన ప్రయత్నాల వలన ఏమి చేయగల్గుతాము?

# సంస్కారము

ఇది సాధనకు ఉపయోగపడే పని అని తెలిసి నిష్కామ కర్మ మొదలు పెట్టడం సుభసూచకమే. నిష్కామ కర్మ ద్వారా మలదోషం (రాగద్వేషాది దుర్గుణాలు) నివారణవుతుంది. విక్షేప, ఆవరణ దోషాలను పూజ, ధ్యానం ద్వారా నిర్మూలించుకోవాలి. వీటన్నింటిలో గురువు కాదు సాయి లాంటి సద్గురువు యొక్క సహాయం చాలా అవసరము. మనం నిష్కామ కర్మ అని మొదలు పెడుతాము. కానీ మనం చేసేది సకామ కర్మయని తెలుసుకోవడం చాలా కష్టం. తెలుసుకోవడం ఎట్లా? పని ఏమైపోయినా మన మనసు ప్రశాంతతను కోల్పోకూడదు. పని సఫలం కావాలనే కోరిక ఉంటేనే అది విఫలమైనప్పుడు చిత్తశాంతి కోల్పోతాము. నిష్కామ కర్మ చేయటం ఎందుకు? రాగ నిర్మూలనకే గదా? పని సఫలమైనా విఫలమైనా లెక్కచేయకుండా ధర్మమార్గంలో పోతుండడమే మన ధ్యేయం కావాలి. పనికి అడ్డంకి వచ్చిందని

పనిచేయడం మానుకోవడం సాధనేకాదు. పని సఫలమైనా విఫలమైనా లెక్కచేయకుండా చివరి వరకు చేయటమొక్కటే సరైన సాధన. మనం కేవలం తెడ్డువంటి వారమనే ఎరుకతో రాగద్వేషాది మలాల నిర్మూలనే మన ధ్యేయమన్న విధంగా సాగటమొక్కటే మంచి మార్గము. పని సఫలం కావటం లేదని మానివేసే సంస్కారం నుండి పని సాగించే సంస్కారం వైపు సాగడమే సాధన అన్నారు శ్రీ మాష్టారు.

# సర్వభూత హృదయాంతర్వర్తి

గుంటూరు అరండల్ పేట నివాసురాలు చాలా బీదవారు. ాIజ పాలసీ ఏడు సంవత్సరాలు కట్టి తర్వాత కట్టలేక మానేసింది. అయ్యో ఇంతటి బీదరికంలో ఇంత డబ్బు పోగొట్టుకున్నామే అని బాబాకు చెప్పుకొని బాధ పడేది. ఒకరోజు ఆమె స్వప్నంలో శ్రీమాష్టరుగారు కనిపించి ''నీపాలసీ తిరిగి వస్తుంది'' అని చెప్పి అదృశ్యమయ్యారు. వారు శ్రీమాష్టరుగారని కూడా తెలియదు. తెల్లవారి ఆ పాలసీ చేయించిన ఏజంటు వచ్చి, ''నీ పాలసీ పోలేదు. నీవు ఒక్క సంతకం పెడితే నీకు అప్పు ఇచ్చినట్లు వ్రాసి ఆ డబ్బు నీ పాలసీ బాకీకి జమవేస్తారు'' అని చెప్పారు.

ఆయన ఆమెకొక ప్రింటెడ్ ఫారము ఇవ్వబోయినపుడు శ్రీమాష్టారు ఫోటో కాపీ క్రింద పడిరది. అది చూచి ఆయన శ్రీభరద్వాజ గారని ఆ ఏజంటు నుండి తెలుసుకొన్నది. అంతా అలాగే జరిగింది.

ఈ మహాసాధ్వి జన్మధన్యతనొందింది. అయితే ఈ లీల యొక్క హృదయం మన హృదయానికి హత్తుకుంటే ఇక తిరుగులేని, ఎడతెగని, ఆనందమే ఆనందమౌతుంది. అంతటి గొప్ప భావ మేమిటో! ఆమె ఎప్పుడూ శ్రీ మాష్టారిని చూడలేదు. తన ఇన్సూరెన్సు పాలసీ కాలదోషం పట్టిందని ఏనాడైనా శ్రీ మాష్టారి చిత్ర పటానికైనా చెప్పుకొన్నదా? అదీలేదు. తన ఆరాధ్య దైవమైన శ్రీ సాయినాథునకు తన హృదయంలోనే తన బాధ చెప్పుకొంటుంది. ఆమె హృదయములో ఉండే బాధను గ్రహించగలగాలంటే శ్రీ మాష్టారుగారు కూడా ఆమె హృదయములోనే ఉండి ఉండాలి. ఆమె హృదయంలో ఎందరు ఉండగలరు? శ్రీ సాయి, శ్రీ మాష్టారు కులదైవం ఇంకెందరో ఆమె  దండం పెట్టే దేవతలు. పిడికెడు పరిమాణం గల హృదయంలో ఇంతమంది ఎలా నివసించ గల్గుతారు. పై చెప్పిన వాళ్ళేగాక అనంత కోటిమందైనా అందరూ ఆ విశ్వచైతన్యానికి ప్రతిరూపాలే. కనుక శ్రీ మాష్టారుగారు విశ్వచైతన్యుడై ఆమె హృదయంలో ఉండి ఆమె బాధతెలుసుకొని ఆమెకు సహాయం చేశారు. ఆలాగే మనందరి హృదయాలలోను ఆయన ఉన్నారు. అన్ని ప్రాణుల హృదయాలలోను ఉన్నారు. కనుక మనం శ్రీ సాయి బాబా భక్తులా? శ్రీ వెంకయ్యస్వామి భక్తులా?శ్రీ మాష్టారుగారి భక్తులా? శ్రీ కృష్ణమాచారిగారి భక్తులా? రామభక్తులా? శివభక్తులా? అనే

భేదం మానమంటున్నారు. అంతటా నిండి నిబిడీకృతమైన విశ్వచైతన్యము మీద మనస్సు నిలపమంటున్నారు. అది సాధ్యం కాకుంటే విశ్వచైతన్యానికి ప్రతిరూపమైన శ్రీదత్తుని పై దృష్టి కేంద్రీకరించమంటున్నారు. అదీ చేతగాకుంటే నీ గురురూపం పై శ్రద్ధా భక్తులతో దృష్టి నిలుపుకుంటే చాలు.

# సిద్ధపురుషులు

1984-85 వ సం॥ ప్రాంతంలో ఒంగోలులో ఇరవై ఐదు సంవత్సరాల వయసుగల ఒక అవధూత ఉండేవాడు. శరీరం పైన ఒక్క నూలు పోగైనా లేని దిగంబరుడు. కడ్డీవంటి శరీరము. రోడ్డు వెంట చకచకా నడిచి వెళ్ళేవాడు. ఎక్కడ తింటాడో ఎక్కడ పడుకుంటాడో ఎవ్వరికీ తెలియదు. వీరిని గూర్చి శ్రీ మాష్టారుగారికి చెప్పి నిజమైన అవధూత అవునో కాదో చెప్పమన్నారు భక్తులు. ఒకరోజు శ్రీ మాష్టారుగారు రిక్షాలో పోతున్నారట. ఈ అవధూతగారు దిగంబరంగా రోడ్డు మీద చకచకా నడిచివస్తున్నారు. శ్రీ మాష్టారుగారు వారి స్థితిని తెలుసుకోవాలని వారికి ఒక పరీక్ష పెట్టారట. ''సాయీ! ఈ వచ్చేవారు నిజంగా అవధూత అయితే నా చేతిలోని అరటి పండు నా అభ్యర్ధనతో నిమిత్తం లేకుండా తీసుకోవాలి'' అని నామం చెప్పుకుంటూ రిక్షాలో పోతున్నారట. ఆ అవధూతగారు సరిగా రిక్షా దగ్గర కొచ్చి మెరుపులాగా ఒక్క అడుగు ప్రక్కకేసి శ్రీ మాష్టారి చేతిలోని అరటి పండు లాక్కున్నారు. అది మొదలు శ్రీ మాష్టారు వారు చక్కని సిద్ధపురుషులని అందరికీ చెప్పసాగారు.

అప్పుడు లాయరుపేట సాయిమందిర సత్సంగ హాలు నిర్మించబోతున్నారు. ప్రతినిత్యం హాలు కట్టబోయే ప్రాంతంలో కూర్చొని ఇన్ని గంటలకు ఆ అవధూతగారు ఇక్కడికొచ్చి కూర్చొనేటట్లు చేయమని సాయినాథునికి చెప్పుకొని పారాయణ చేయమని భక్తులకు చెప్పారు. వారలాచేయగానే చిత్రంగా ఏనాడూ ఆ ప్రాంతానికి రాని ఆ అవధూతగారు అక్కడికొచ్చి వారనుకున్నచోటే కొంత సేపు కూర్చొని వెళ్ళేవారు. ఇలా నిత్యం ఒక వారం రోజులు జరిగింది.

ఈ విషయం ఒక ధనవంతుడైన ఆఫీసర్‌గారికి తెలిసి, 'సార్! నేను పారాయణ చేస్తాను. వారు మా ఇంటికొచ్చి భోంచేస్తారా?' అని అడిగితే 'తప్పక వస్తారు. చేసిచూడండి' అని శ్రీ మాష్టారు చెప్పారు. ఆ ఆఫీసర్‌గారు ఒక వారం ఆ సంకల్పంతో పారాయణ చేశారు. చివరి రోజు వంట తయారైంది. ఎంత సేపు ఎదురు చూచినా అవధూతగారు కనిపించలేదు. ఆకలికి నిలువలేక ప్రహరీ గోడకున్న గేటు దగ్గర కొచ్చి అదిరిపోయాడు. ఆ అవధూతగారు అక్కడే గోడ ప్రక్కన నిలబడి ఉన్నాడు.

ఈ ఆఫీసర్‌గారు పబ్లిక్‌రోడ్ మీద దిగంబరుడైన వారికి అంతమందిలో తలవంచి నమస్కారం చేయలేక, చేయకుండా వుండలేక రెండు నిమిషాలు

తటపటాయించి రోడ్డు మీద ఎవ్వరూ లేకుండా చూచి గబుక్కున పాదనమస్కారం చేసి లేచి వారిని భోజనానికి రమ్మని ఆహ్వానిస్తే భోజనం బయటకు తెమ్మని సైగ చేసి వారలానే ఇంటి బయటే తిని వెళ్ళిపోయారు.

కరుణామయుడైన దైవం అనుగ్రహించినా మన చెడ్డ సంస్కారాలు ఎలా అడ్డుపడుతాయో చూడండి. దైవానుగ్రహం పొందికూడా, నేను వీరికి నమస్కరిస్తే ప్రజలేమనుకుంటారో అని వెనుకాడుతున్నాడు. ఇది మనందరికీ వుండే దుర్గుణమే. దీనినే శ్రీస్వామివారు ''మీలోని జోగి, జంగం వారిని తరిమేయండి అన్నారు.

# మహనీయులు కరచాలనంతో వస్తువులు సృష్టించరు

నారాయణ బాబాగారనేవారు గుంటూరు వచ్చారు. వారు తన దివ్య స్పర్శతోను, దివ్య చూపుతోను మొండి జబ్బులన్నీ నయం చేస్తున్నారని ''ఏమీ నిన్నుపేక్షింతునా?'' అనే మాసపత్రికలో ప్రకటన చూచి నా ఆయాసం తగ్గిస్తారేమో నని ఆశపడి శ్రీ మాష్టారికి చేప్పే వ్యవధిలేక చెప్పకుండానే గుంటూరు వెళ్ళాను. స్పెషల్ ఇంటర్వ్యూలో వారు నాకేవస్తువూ ఇవ్వలేదు. పాదనమస్కారం చేసుకొని వస్తుంటే వారిని గుంటూరు తీసుక వచ్చిన శ్రీ ఆదిపూడి మోహన్‌రావుగారు నన్ను గురించి రెకమెండ్ చేయగా వారు కరచాలనంతో ఒక సాయి బాబా డాలరు తెప్పించి నాకిచ్చారు. నా జన్మ ధన్యమైందని గొప్పగా సంతోషించి ` వస్తూనే శ్రీ మాష్టారికి విన్నవించాను. వారు వెంటనే అన్నారు. ''నీవు మోసపోయావు. నిజమైన మహనీయులు కరచాలనముతో వస్తువులు సృష్టించరు. నీ జీవితములో ఇది మరచి పోవద్దు'' అని చెప్పారు. వారు చెప్పినట్లే నా ఆయాసం ఒక రేణువైనా తగ్గలేదు.

శ్రీ మాష్టారు చెప్పిన దానికి దృష్టాంతముగా శ్రీ రాఖాడి బాబాగారు శ్రీ పూర్ణానంద స్వామి వారికి ప్రథమ దర్శనమిచ్చినప్పుడు శ్రీ రాఖాడి బాబాగారు వారున్న గుహలోని ఒక బండ వెనుక చెయ్యి పెట్టి అరటాకులో పొగలు కక్కే అన్నం తీసి ఇస్తారు. అట్లాగే అరటి దొన్నెలలో రసము, సాంబారు తీసి ఇస్తారు. రాతి వెనుక ఉంటే తీసి ఇచ్చినట్లు తీశారుగాని కరచాలనంతో గాలిలో నుండి అన్నం, కూరలు సృష్టించి ఇవ్వలేదు. కనుక మహనీయులు కరచాలనంతో వస్తువులు గాలిలో సృష్టించరు.

నేడు ప్రపంచమంతా కలిపురుషుని గుప్పెట్లో ఉంది.కనుక ప్రతి ఒక్కరూ ఒక సాధువుకు పాదనమస్కారం చేసి దక్షిణ సమర్పిస్తే మంచిదని వేలం వెర్రిగా పరుగులుతీస్తున్నారు. సాక్షాత్తు విష్ణుమూర్తే మానవ రూపంలో వచ్చి నిజమైన మహనీయులిట్లా ఉంటారు అని చెప్తే వారి సలహాపాటించేవారు చాలా కొద్ది మంది మాత్రమే. నిజమైన సత్‌పురుషుడెలా ఉంటారో ఈ క్రింది సన్నివేశం తెలుపుతుంది.

మహాత్మాగాంధిగారి వార్ధా ఆశ్రమం నుండి ఒక సాధువు శ్రీ స్వామి వారి దర్శనార్థం వచ్చాడు. ఆయన తహసిల్‌దారుగా ఉండి సన్యాసదీక్ష తీసుకొని ఉద్యోగం వదిలేసి భగవదన్వేషణలో ఉన్నారు. నిజమైన మహనీయుడు నెల్లూరు ప్రాంతంలో శ్రీ వెంకయ్య స్వామి అనే పేరుతో భిక్షతో జీవిస్తున్నారు అనిచెపితే వెదుక్కుంటూ వచ్చాడు. ఆయనకు శ్రీ స్వామివారిని గూర్చి ఏమీ తెలియదు. వారిని శ్రీ స్వామివారి దర్శనార్థం తలుపూరు తీసుకవెళ్ళాము. అదేమి చిత్రమోగాని ఆనాడు ప్రక్క గ్రామాల నుండి ఏదో గ్రామ తగాదా తీర్మానంలో శ్రీ స్వామివారి సలహా కోరాలని జనం కొన్ని వందల మంది శ్రీ స్వామివారిని చుట్టిముట్టి ఉన్నారు. కాషాయాంబరధారి j్ైన ఆ సన్యాసి, నేను ఈ రోజు శ్రీ స్వామివారిని దర్శించలేమని చాలా దూరంగా ఉన్నాము. వెంటనే శ్రీ స్వామి సేవకుడు మా దగ్గర కొచ్చి శ్రీ స్వామి వారు (1) కాషాయం కట్టిన సాధువును పిలుస్తున్నారని తీసుకపోయాడు. (2) ఆ సాధువు దీక్ష తీసుకున్న తేదీ దీక్ష విరమించ బోయే తేదీ చీటీలో వ్రాయించారు. (3) నీతో గూడా గొలగమూడాయన స్నేహితుడు వచ్చాడు అని కూడా వ్రాయించారు. నాకు మొదట శ్రీ స్వామివారిని గురించి వారి గొప్ప తనాన్ని గూర్చి చెప్పిన వాడు ఆ గొలగమూడాయనే. ఈ మూడు విషయాలు విన్న ఆ సన్యాసి ఎంతగా పొంగి పోయాడో చెప్పలేను. సిద్ధపురుషులకు మన సర్వం తెలిసే ఉంటుంది.

నిజమైన సిద్ధపురుషులు మన మనోభావాలను గుర్తించి మన పవిత్రమైన కోరిక తీర్చడం ద్వారా మనకు భగవంతుని పై భక్తి. విశ్వాసములు వృద్ధియగునట్లు అనుగ్రహిస్తారు. ఉదాహరణకు నేను భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారిని ప్రథమంగా దర్శించినపుడు ''(1) నేను తీసుక వెళ్ళిన శెనగలు బెల్లం నేను అడగకుండా వారికై వారే అడిగి పెట్టించుకొని తినాలి. (2) ఎవ్వరినీ తాక నివ్వని శ్రీ స్వామివారు నా చేత తన కాళ్ళకు నువ్వుల నూనె మర్దన చేయించుకోవాలి. ఇవి రెండు కూడ నేను వెళ్ళిన పదినిమిషాలలో జరిగిపోవాలి.'' అనుకొని కూర్చోగానే జరిగిపోయాయి. కనుక వారు గొప్ప సిద్ధపురుషులని భూమి పై తిరిగే దైవమని నమ్మమని శ్రీ మాష్టారు చెప్పారు.

ఇదే విధంగా నేను శ్రీ మాయి అమ్మగారిని దర్శించినపుడు వారికి గంటల తరబడి తల దువ్వుతున్న ఒక భక్తుని చూచి అలాంటి సేవ నేను కూడ వారికి కొంత సేపు చేయాలని మనసులో తపన కల్గింది. కాని రాజేంద్రన్‌గారు అమ్మకు దూరంగా ఉండాలని ఆంక్ష పెట్టారు. చివరిరోజు రాజేంద్రన్‌గారు లేనప్పుడు నేనడుగకుండా అమ్మకై అమ్మే సైగతో నన్ను పిలచి తల దువ్వించుకున్నారు. అలా నా మనసులోని తీరని కోరికను తీర్చారని అర్థం అయ్యింది.

అలాగే నేను పదిరూపాయల నోటు మడిచి తమలపాకుల మధ్య పెట్టి తాంబూల మివ్వబోతే అమ్మ వద్దని నెట్టేశారు. నేను చాటుకు వెళ్ళి ఆ పది రూపాయలనోటు తీసి నా

జేబులో వేసుకొని తిరిగి తాంబూల మిస్తే ఎంతో ఆప్యాయంగా తీసుకున్నారు. ''నీవు చాటుగా పదిరూపాయల నోటు తమలపాకుల మధ్య పెట్టిన విషయం నాకు తెలుస్తుంది,'' అని అమ్మ నాకు తెలియ జేస్తున్నారు. వారు నోటితో బోధించక పోయినా 'నేను సర్వసాక్షిని' అని తెలియజేస్తున్నారు. అలాంటిది సిద్ధపురుషుల లక్షణం.

తన గతవైభవాన్ని గూర్చి మనకు చెప్పినవాడు సిద్ధపురుషుడే కాదు అన్నారు శ్రీ మాష్టారు. ఉదాహరణకు నేను ప్రథమంగా షిరిడీకి వెళ్ళినప్పుడు ఎముకలు గూడైయున్న ఒక సాధువు చాలా అశుభ్రంగా ఉన్న వస్తువులన్నీ పెట్టుకొని కూర్చొని ఉన్నాడు. నన్ను తన దగ్గరకు పిలిచి తన సాధన గురించి చెప్పి ` తాను బికారిని కాదనియు తనకు వందల టెంకాయ చెట్లు ఎన్నో ఎకరాల పొలము, మిద్దె ఇల్లు, భార్యా బిడ్డలున్నారని చెపుతూ మరునాడు తన దీక్షా విరమణ కనుక రెండు పంచెలు క్రొత్తవి తెచ్చి ఇమ్మన్నాడు. ఈ మాట మాష్టారికి చెప్పగానే ` ''నీవు మోసపొయ్యావు. తన గత వైభవం చెప్పిన వాడు సిద్ధపురుషుడేకాదు. నేను ఎన్నో సంవత్సరములు ప్రయత్నంచి కూడా చీరాల స్వామి వారి నుండి వారి అసలుపేరు. స్వగ్రామము తెలుసుకోలేకపోయాను''. అన్నారు.

కాపీలు కావలసిన వారు వీరికి వ్రాయండి:
శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి (పోస్ట్), (వయా)సర్వేపల్లి
నెల్లూరు జిల్లా, ఆం.ప్ర. 524321

వెల: 5.00